# ఈనెల 12 నుండి అన్ని మండలాల్లో నిరసన దీక్షలు..

**- సీఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులకు నిరసనగా నిరాహార దీక్ష**

**- జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**రాజాపూర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కెసిఆర్ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో ఇల్లు లేకుండా ఉండి ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలకు రూ.5లక్షలు ఇస్తానని వాగ్దానం చేసి మాట నిలుపుకోలేదని, గత అసెంబ్లీ సమావేశాలలో హరీష్‌రావు ఇల్లులేని నిరుపేదలకు రూ.3లక్షలు నియోజకవర్గ పరంగా 3 వేల మంది లబ్దిదారులను ఎంపిక చేసి రాష్ట్ర వ్యాప్తంగా 4లక్షల మందికి ఆర్థిక సహాయం చేస్తానని మాట ఇచ్చి మాట తప్పారని, దీనికి నిరసనగా జడ్చర్ల నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాలలో ఈ నెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిరసన దీక్ష చేయనున్నట్లు అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి గోడపత్రికను ఆదివారం టిపిసిసి అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాను చేస్తున్న కార్యక్రమం పట్ల రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారని, ముమ్ముందు జడ్చర్ల నియోజకవర్గంలో భారీ ఎత్తున కార్యక్రమాలు చేస్తూ పార్టీని బలపర్చాలని తనకు సూచించినట్లు అనిరుధ్‌రెడ్డి తెలిపారు.



రేవంత్‌రెడ్డితో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## క్రీడల అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ పాలమూరు..!

**-రాష్ట్ర క్రీడల మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో తెలంగాణ ఎలక్ట్రిసిటి సంస్థల ఉద్యోయుల (ట్రాన్స్ కో అండ్ డిస్కమ్స్) ఆద్వర్యంలో నిర్వహించిన ఇంటర్ సర్కిల్ క్యారమ్స్, వాలీ బాల్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని శాట్స్ మైదానం గతంలో ఎంతో నిర్లక్ష్యానికి గురైందన్నారు. నిరుపయోగంగా, మట్టి దిబ్బలతో నిండి పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కెసిఆర్ సహకారంతో జిల్లా స్టేడియంలో అన్ని రకాల క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. నేడు రాష్ట్రస్థాయి క్రీడలకు వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా క్రీడా మైదానంలో నేడు వాలీబాల్, అర్చరీ, అథ్లెటిక్, కబడ్డి, ఫుట్‌బాల్ లాంటి క్రీడలకు వేదికగా నిలిచిందన్నారు. స్టేడియంకు అనుబంధంగా ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న ఖమ్మం సర్కిల్ క్రీడాకారులను మంత్రి అభినందించారు. అనంతరం విజయం సాధించిన క్రీడా జట్టుకు మెమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా ఎలక్ట్రిసిటి ఎస్ఈ మూర్తి, తెలంగాణ ఎలక్ట్రిసిటి స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, షకీల్, షఫి, స్థానిక కౌన్సిలర్ రాంలక్ష్మణ్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## బిజెపి ఒత్తిడితోనే విమోచన దినోత్సవంపై పార్టీల్లో కదలిక

**- ప్రధాని సూచనల మేరకే ప్రభాస్ యోజన**

**- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డా. మహేంద్రనాథ్ పాండే**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ఒత్తిడితోనే సెప్టెంబర్ 17పై అన్ని పార్టీలు మాట్లాడుతున్నాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. పార్లమెంట్ ప్రభాస్ యోజనలో భాగంగా పాలమూరుకు వచ్చిన ఆయన ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండలోని బూత్ అధ్యక్షుడు మురళిగౌడ్ ఇంటికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ బూత్ స్థాయిలో కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న బూత్ అధ్యక్షుని తండ్రితో ఆయన ముచ్చటిస్తూ మీ కష్ట, సుఖాలను తెలుసుకుని రమ్మని మీ దగ్గరికి నన్ను దేశ ప్రధాని నరెంద్రమోడీ పంపించారని తెలిపారు. ఆయన తరపున నా నమస్కారాలు తెలియ జేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డికె అరుణమ్మ, జాతీయ కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పడాకుల సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్‌రెడ్డి, నంబిరాజు, కౌన్సిలర్లు రామాంజనేయులు, అచ్చుగట్ల అంజయ్య, పట్టణ అధ్యక్షులు పి. రాజేందర్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి

## పార్టీకోసం కార్యకర్తలు నడుం బిగించాలి

**-ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు**

**ఉప్పునుంతల, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** తెరాస ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు నిస్పక్షపాతంగా పని చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో తెరాస గ్రామకమిటి అధ్యక్షుడు మేడమోని శ్రీనివాసులు, అచ్చంపేట పాలశీతలీకరణ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డిల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల నుండి పార్టీలోకి రావడంతో పార్టీ కండువా వేసి స్వాగతించారు. పార్టీకోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కంకణబద్దులు కావాలని ఆయన కోరారు. వివిధ పార్టీలకు చెందిన మేడమోని బాల్‌రాం, చిట్టెమ్మ, చిన్న బక్కయ్య, చంద్రయ్య, చంద్రయ్య, నిరంజన్, సత్తయ్య, వెంకటేష్, శ్రీను, రాజు, పద్మ, రాధ తెరాస పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

# సమసమాజ నిర్మాణంలో రచయితలది గొప్ప పాత్ర..

**- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**- ఘనంగా పాలమూరు సాహితి అవార్డుల ప్రధానం**

**- వెంకటేశ శతకం ఆవిష్కరణ**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** సమసమాజ నిర్మాణంలో రచయితలది క్రియాశీలక పాత్ర అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరిగిన పాలమూరు సాహితి పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు జిల్లా అంటేనే కవుల జిల్లా అని, సురవరం ప్రతాప్‌రెడ్డి జన్మించిన నేల అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర విస్మరించరానిదన్నారు. ఎందరో కవులు, రచయితలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ఉద్యమానికి ఊపిరిలూదారన్నారు. ఆనాడు మన కవులను ఎక్కిరించిన ఆంధ్ర కవులను నిరసిస్తూ గోల్కొండ కవుల సంచికను 354 మంది కవులతో వెలువరించడం తెలంగాణ పౌరుషాన్ని చాటుతుందన్నారు. మన సమాజంలో ఇంకా నెలకొని ఉన్న భావజాడ్యాలను తొలగించేందుకు, అంటరానితనాన్ని రూపుమాపేందుకు కవులు విశేషంగా కృషి చేయాలన్నారు. అనంతరం 2020 సంవత్సరానికి ఖగకవిత్వమే ఓ గెలాక్సీగగ కవితా సంపుటిని రచించిన ఐనంపూడి శ్రీలక్ష్మికి, 2021 సంవత్సరానికి ఖగప్రాణదీపంగగ కవితా సంపుటిని రచించిన గాజోజు నాగభూషణానికి మంత్రి పాలమూరు సాహితి పురస్కారాలను, మెమెంటో, శాలువాతో పాటు రూ. 5116 నగదు పురస్కారాలను అందజేశారు. పాలమూరు గడ్డ నుంచి పాలమూరు సాహితి సంస్థ ప్రతి సంవత్సరం పురస్కారాలను లబ్ధప్రతిష్టులైన కవులకు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. అలాగే యువకవి డా. వెలుదండ వెంకటేశ్వరరావు రచించిన ఖగవెంకటేశ శతకంగగను మంత్రి ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కళాకారుల సంస్థ అధ్యక్షులు వి. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మేలిమి సాహిత్యాన్ని సృజిస్తున్న కవులకు ప్రతి సంవత్సరం పాలమూరు సాహితి పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ పాలమూరు జిల్లా సాహిత్యం తెలంగాణ సాహిత్యానికి దిక్సూచి అని కొనియాడారు. అప్పకవి జన్మించిన నేల మంచి పాలమూరు సాహితి పురస్కారాలను అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎంతోమంది ఉద్దండులైన కవులు, రచయితలు, పరిశోధకులు, విమర్శకులు పుట్టిన నేల పాలమూరు జిల్లాఅని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా కవుల పాత్ర గొప్పదన్నారు. పాలమూరు సాహితి అవార్డు వ్యవస్థాపకులు డా.భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో బలమైన సామాజిక కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు గత పన్నెండు సంవత్సరాలుగా పాలమూరు సాహితి పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రముఖ విద్యావేత్తలు కె. లక్ష్మణ్‌గౌడ్, వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డిలు మాట్లాడారు. పురస్కార గ్రహీతలైన ఐనంపూడి శ్రీలక్ష్మి, గాజోజు నాగభూషణంలు మాట్లాడారు. అనంతరం వెంకటేశ శతకం పుస్తకాన్ని డా. విరివింటి సురేష్‌బాబు సమీక్ష చేశారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా డా. గుంటిగోపి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



హాజరైన కవులు



వెంకటేశ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# తెరాస ఎమ్మెల్యేల్లో హుషారు..!

**- ఆశావాహుల్లో బేజారు**

**- వేడెక్కించిన సీఎం ప్రకటన**

**- కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు తథ్యం**

**- అందరి దృష్టి కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌పైనే**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి వెళ్లాయని రాబోయే రోజుల్లో తిరిగి టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తం చేస్తూ వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తామని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం ప్రకటనతో అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో మరింత హుషారు పెరిగింది. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్దమేనంటూ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సంకేతాలు పంపిస్తున్నారు. అయితే కొన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా ఉన్న అసమ్మతి నేతలు కొత్తగా టికెట్లు ఆశిస్తున్న ఆశావాహులు సీఎం ప్రకటనతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మధ్యనే ఉండి సేవ చేయాలని, ప్రభుత్వ పథకాలపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నియోజకవర్గాలపై పట్టున్న శాసనసభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆబ్కారిశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహా ఎమ్మెల్యేలు ఇప్పుడు నియోజకవర్గాలలో ప్రజలతో మమేకమవుతున్నారు. ఏ చిన్న కార్యక్రమం అయినా తుచ తప్పకుండా పాల్గొంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు గాని, అధికార టిఆర్ఎస్ పార్టీ తరపున తమకు భరోసా కలిగిందనే భావనతో ఎమ్మెల్యేలు విస్తృత పర్యటనలతో బిజీబిజీగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఆయా నియోజకవర్గాలలో మొదటి నుండి పార్టీలో పనిచేసిన సీనియర్లు, ఆశావాహులు, అసమ్మతి నాయకులు గంపెడంత ఆశ పెట్టుకుని పార్టీకోసం పని చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రకటనతో అధికార పార్టీలో వేడెక్కించింది. కిందిస్థాయి నాయకులు ముఖ్యమంత్రి పర్యటనపై తర్జన భర్జన పడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరి పక్షాన పనిచేయాలన్న విషయంపై వారు సందిగ్ధంలో పడ్డారు. ముఖ్యంగా ఉమ్మడి



జిల్లాలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాలపైనే అందరి దృష్టి ఉంది. ఈ నియోజకవర్గాల్లో టిఆర్ఎస్ పార్టీ బలంగా ఉండడమే కాకుండా ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో రాష్ట్ర అధిష్టాన వర్గానికి తలనొప్పిగా మారింది. కొల్లాపూర్ నియోజకవర్గం విషయానికొస్తే స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వ్యతిరేక కూటమిగా సొంత పార్టీలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గం బలంగా పని చేస్తుంది. ఈసారి హర్షవర్ధన్‌రెడ్డికే టికెట్ ఇస్తే జూపల్లి కృష్ణారావు రాజకీయ భవిష్యత్తు ఏంటని విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. టిఆర్ఎస్‌లో టికెట్ ఇవ్వకుంటే ఆయన బిజెపి లేదా కాంగ్రెస్‌లో చేరిపోవడం ఖాయమని ప్రచారం జరుగుతుంది. అదేవిధంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి మొదటినుండి రాజకీయ భేదాలున్న ఎమ్మెల్సీ, సీనియర్ నాయకుడు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఈసారి తనకే టికెట్ కావాలని అధిష్టానం వద్ద ఒత్తిడి పెంచినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. తన పంతం నెగ్గకుంటే ఇతర పార్టీలో చేరకుండానే సొంత పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని వ్యతిరేకించే స్థాయి ఉన్నందున రాజకీయ పరిస్థితి ఇక్కడ తారుమారు అయ్యే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. మరోపక్క మర్రి జనార్ధన్‌రెడ్డి కూడా ఎప్పటికప్పుడు సీఎంతో మంత్రి కెటిఆర్‌తో టచ్‌లో ఉన్నారు. మర్రి చేసిన అభివృద్ధి కార్యక్రమాలే మరోసారి ఆయనకే టికెట్ వచ్చేలా చేస్తాయని టిఆర్ఎస్ నాయకులు అంటున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం విషయానికొస్తే సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ధీటుగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మరోపక్క సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు బాలాజీసింగ్‌లు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్సీ నారాయణరెడ్డి మొదటినుంచి ఎమ్మెల్యే పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గద్వాల నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీలో టికెట్ కోసం విపరీతమైన పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ధీటుగా జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఛైర్మన్ గట్టు తిమ్మప్పలు పోటీ పడుతున్నారు. అదేవిధంగా మక్తల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి పోటీగా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరి మల్లప్ప టికెట్ ఆశిస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో డా. లక్ష్మారెడ్డి బలమైన నాయకుడుగా ఉన్నప్పటికిని టిఆర్ఎస్ నుండి ఈసారి తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి జడ్చర్ల టికెట్ ఆశిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే డా. అబ్రహాంకు ధీటుగా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డా.మంద జగన్నాథం ఎమ్మెల్యే టికెట్‌కు పోటీపడే అవకాశం ఉంది. గతంలో జగన్నాథం కుమారుడు మంద శ్రీనాథ్ నియోజకవర్గ ఇంఛార్జిగా పనిచేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్నం నరెందర్‌రెడ్డి వర్గంతో పాటు మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి వర్గం టిఆర్ఎస్‌లో పనిచేస్తూ ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నారు. పై విషయాలన్ని గమనిస్తే రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లాలో భారీ ఎత్తున రాజకీయ మార్పులు, చేర్పులు, సమీకరణలు ఉంటాయని పలువురు అంటున్నారు.

# పాడి రైతుల అరణ్యరోదన..

**పాడి సంపదకు సుస్తి..**
**పశువైద్యశాలకు దారి లేక ఇబ్బందులు..**
**ప్రభుత్వ స్థలాలు మాయం..?**

**జల్లాఘనపురం, సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** దశాబ్దాల కాలంగామూగజీవాలకు వైద్యం చేస్తూ పశువుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న పశువైద్యశాలకు దారి లేకుండా పోతుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు ఆసుపత్రికి వెళ్లే దారిలో చిరు వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుతూ పశువుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. 1964 సంవత్సరంలో మండల కేంద్రంలో పశువైద్యశాలను ఆహ్లాకరమైన వాతావరణంలో సువిశాల స్థలంలో ఏర్పాటు చేయడంతో మండల పరిధిలోని పాడి రైతులకు నాటి నుండి పశువులకు వైద్య సేవలందిస్తు పశువైద్య సిబ్బంది ప్రశంసలు పొందుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1976వ సంవత్సరంలో మండల కేంద్రంలో నిర్మించిన పశువైద్యశాలను ప్రారంభించడం జరిగింది. నాడు పశువైద్యశాలను రూరల్ వెటర్నరీ డిస్పెన్షరి (ఆర్‌విడి)గా పలిచే సమయం నుండి మండల కేంద్రంలో పశువులకు విస్తృత వైద్య సేవలందుతున్నాయి. నాడు సర్వే నెంబర్ 1125లో పశువైద్యశాలకు దాతలు 1.10గుంటల భూమిని కేటాయించినట్లు రికార్డులో నమోదైంది. తదనంతరం 1984వ సంవత్సరంలో మాజీ సర్పంచ్ రాంచందర్‌రావు పీరియడ్ లో పశువైద్యశాలకు వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తూ గ్రామ పంచాయితీ తీర్మానం చేసింది. పశువైద్యశాల పరిసరాలను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని ప్రచారంలో ఉంది. గణ చరిత్ర గల జల్లాఘనపురం పశువైద్యశాల ప్రాంగణంలో నాడు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించే స్థాయిలో ఖాళీ స్థలం ఉండేది. అలాంటి పశు వైద్యశాలకు పాడి రైతుల పశువులు వెళ్లడానికి దారి లేకుండా పోతుందని పశు పోషకులు ఆరోపిస్తున్నారు. పలు మార్లు మూగజీవాలు చిరు వ్యాపారులను గాయ పరచిన సంఘటనలు తలెత్తాయి. ఎద్దులు, గేదెలు దారికి అడ్డంగా ఉన్న కూరగాయాలు, పూల గంపలను ధ్వంసం చేయడం సర్వసాధరణంగా మారింది. నాడు పశువులు సేదతీరడానికి ఉన్న స్థలం నేడు ఇరుకుగా పశువులకు నిలువ నీడ లేకుండా పోయింది. పాడి రైతులను ఆదుకుంటున్నామని తెలంగాణ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న పాడి సంపదకు సుస్తి చేస్తే బాగు చేసే పశువైద్యశాలలను కాపాడుకోలేని పరిస్థితులు దాపరించాయి. పాత పశువైద్యశాల భవనాన్ని పడగొట్టి ప్రక్కనే కొత్త భవనం నిర్మించిన వైద్యశాల ప్రాంగణం మురికి నీటితో నిండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు సంపదను కాపాడే పశువైద్యశాలల సంరక్షణ ప్రజా ప్రతినిధులు అధికారులదేనని పాడి రైతులు తెలిపారు. పశువులకు నాణ్యమైన వైద్యసేవలందించడానికి పశు వైద్యశాలలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని అన్నారు.



పశువుల ఆసుపత్రికి వెళ్లే దారిలో చిరు వ్యాపారం





మండల కేంద్రంలోని పశువైద్యశాల

**పశువైద్యశాల దారికి అడ్డంగా చిరు వ్యాపారులు..**
**గోనెల రాములు పాడి రైతు.**

పశువులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి పశువులను తీసుకువచ్చే సమయంలో దారికి అడ్డంగా చిరు వ్యాపారులు క్రయ విక్రయాలు జరుతున్నారని పాడి రైతు గోనెల రాములు వాపోయారు. చిరు వ్యాపారుల వస్తువులను పశువులు తగలడంతో రైతులకు, చిరు వ్యాపారులకు సర్వసాధరణంగా వాగ్వాదం నడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యశాల ఆసుపత్రి ఆక్రమణకు గురికాకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.



**పశువైద్యశాలకు గేటును ఏర్పాటు చేయాలి..**
**పాడి రైతు ఆంజనేయులు..**

పశు వైద్యశాలకు గేటును ఏర్పాటు చేసి పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పాడి రైతు ఆంజనేయులు కోరారు. పాలు అమ్ముకొని జీవనోపాధి పొందుతున్న రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని ఆకాంక్షించారు. మూగజీవాలకు కేటాయించిన స్థలం తగ్గిపోవడం బాధాకర మని అన్నారు.



**పశువైద్యశాల దారికి అడ్డంకులు..**

డాక్టర్ సుషిన్ కేషి పశువైద్యశాలకు నిత్యం పదుల సంఖ్యలో వైద్యం నిమిత్తం పశువులు వస్తున్న నేపథ్యంలో గేటు ముఖ ద్వారం వద్ద చిరు వ్యాపారు బుట్టలతో అడ్డంగా ఉంటున్నారని పశువుల ఆసుపత్రి డా.సుషిన్ కేషి తెలిపారు. పలు మార్లు చిరు వ్యాపారులకు వైద్యశాలకు అడ్డంగా క్రయవిక్రయాలు జరపవద్దని విజ్ఞప్తి చేసినా వినడం లేదని అన్నారు. వైద్యశాల ప్రాంగణంలో మిషన్ భగీరథ ఓవర్ హెడ్‌ట్యాంక్ నుండి వచ్చే అదనపు నీరు ఆసుపత్రి ఆవరణలో నిలిచిపోతుందని డాక్టర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు సహకరించి పశువుల ఆసుపత్రి అభివృద్ధి సహకరించాలని డాక్టర్ కోరారు.



## భార్య కాపురానికి రాలేదని టవర్ ఎక్కిన భర్త..

**- పోలీసుల హామీతో టవర్ దిగిన లింగస్వామి**

**- ఎస్సై వి. ప్రదీప్‌కుమార్**

**తెల్కపల్లి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** భార్య అలిగి పుట్టింటికి వెళ్లి రాలేదనే నెపంతో తన భార్య రావాలంటూ టవర్ ఎక్కిన భర్త హల్‌చల్ చేసిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వి. ప్రదీప్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గట్టురావిపాకుల గ్రామానికి చెందిన లింగస్వామి నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల భార్యాభర్తలు ఘర్షణ పడగా భార్య అలిగి తల్లిగారి ఊరికి వెళ్లడంతో తన భార్య రావాలంటూ గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కాడు. దూకుతా అంటూ హల్‌చల్ చేయడంతో స్థానికులతో విషయం తెలుసుకున్న ఎస్సై వి. ప్రదీప్‌కుమార్ పోలీసులను సంఘటనా స్థలానికి పంపించి సెల్ టవర్ ఎక్కిన లింగస్వామికి నచ్చజెప్పి ఎట్టకేలకు సెల్‌టవర్ మీద నుంచి కిందికి దించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి లింగస్వామికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్సై వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు.



భార్య రావాలంటూ సెల్‌టవర్ ఎక్కిన లింగస్వామి

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం..

**సీపీఎం సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ..**



**పాన్‌గల్,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని రే మొద్దుల గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బర్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కార్య కర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కా రం ఎర్రజెండాతోనే సాధ్యం అని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం పోరాడాలని పిలుపునిచ్చారు. అదే క్రమంలో గ్రామాలలో సీపీఎం పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. అర్హులైన వారందరికి ఆసరా పింఛన్లు మంజూరు చేసేందుకు అధికారులు కృషి చేయాలని రాజకీయాలకు అతీతంగా అధికారులు పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పుట్ట ఆంజనేయులు, మండల సీపీఎం మండల కార్యదర్శి దేవేందర్, జిల్లాలో వివిధ మండలాల పార్టీ నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు విఫలం



**వెల్దండ, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**ఆసరా పెన్షన్ కోసం ధరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో మండల అధికారులు విఫలమయ్యారని మండల నాయకులు శివరాజ్‌గౌడ్, రమేష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ స్వయ ప్రయోజనాల కోసం అధికారులు పనిచేశారని, దీంతో అర్హులైన వారికి అన్యాయం చోటు చేసుకుందన్నారు. ఆసరా పెన్షన్ కోసం ధరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడిచిన నేటికి వారికి పెన్షన్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన నిజమైన లబ్ధిదారులను గుర్తించి ప్రతి ఒక్కరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థినిలను వేధించిన వారిపై కేసు నమోదు

**ఎస్సై వి.ప్రదీప్‌కుమార్**

**తెల్కపల్లి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** కళాశాల విద్యార్థినిలను తీవ్రంగా వేదించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వి. ప్రదీప్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని జమిస్తాపూర్ గ్రామానికి చెందిన 6 మంది విద్యార్థినిలు నాగర్‌కర్నూల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. రోజు గ్రామంనుండి నాగర్‌కర్నూల్‌కు వెళ్లి వస్తారు. ఇదే క్రమంలో శనివారం సాయంత్రం 6 మంది విద్యార్థినిలు నాగర్‌కర్నూల్ నుండి జమిస్తాపూర్ గ్రామం గేటు దగ్గర బస్సుదిగి గ్రామానికి నడిచి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన 8 మంది విద్యార్థులు వారివెంట పడి తీవ్రంగా వేధించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ ఆదివారం తెలిపారు.

## కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా నర్సంపల్లి గోపాల్



**కల్వకుర్తి, ఆగస్టు 04, ప్రభాతవార్త:**కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా నర్సంపల్లి గోపాల్, ఉపాధ్యక్షులుగా సైదులు నియమితులయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిలు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా నర్సంపల్లి గోపాల్, ఉపాధ్యక్షులుగా సైదులుకు నియామక పత్రం అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు శేఖర్, పట్టణ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుడుముల చంద్రకాంత్‌రెడ్డి, సేవాదల్ పట్టణ అధ్యక్షులు ఆరీఫ్, సంజాపూర్ అంజయ్య, నాయకులు తోటపల్లి అనిల్‌కుమార్, మాలిక్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## బస్సు కండక్టర్, డ్రైవర్ ఔధార్యం...



**కల్వకుర్తి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నాగర్‌కర్నూల్ నుంచి కల్వకుర్తికి వస్తుండగా ఓ ప్రయాణీకుడు బస్సులో ల్యాప్‌టాప్, డైరీ, ఇతర వస్తువులతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఇది గమనించిన మహిళా కండక్టర్ ఆర్. కల్పన, డ్రైవర్ డీఎన్‌రెడ్డిలు బ్యాగ్‌ను గమనించి బ్యాగ్‌లో ఉన్న డైరీని తీసి చూడగా అందులో ప్రయాణీకుడి నెంబరు ఉండటంతో ఆ నెంబరుకు పోన్ ద్వారా సమాచారం అందించారు. ప్రయాణీకుడు బస్టాండ్‌కు చేరుకోవడంతో డిపో మేనేజర్ శ్రీకాంత్, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రావులతో కలిసి డ్రైవర్, కండక్టర్లు బ్యాగును ప్రయాణికుడికి అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

## విఘ్నేశ్వర అందుకోవయ్యా మా పూజలు...



**కల్వకుర్తి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**ఆది దేవుడా విఘ్నేశ్వర... సర్వ సుఖాలను అందించే గణపయ్యా...విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వర అందుకోవయ్య మా పూజలు.. హైదరాబాద్‌లోని వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. గణనాథునికి ఇష్టమైన తీపి వంటకాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రుల్లో ఏ ఒక్క రోజైన విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తే ఆయన కృప కుటుంబ సభ్యులపై ఉండి కలకాలం సుఖ సంతోషాలతో మెలిగే విధంగా చూస్తారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామానికి చెందిన పరమేష్‌కు మంజూరైన రూ.30వేలు, లక్ష్మయ్యకు మంజూరైన రూ.14వేల సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, గోళి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## గణపతి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**-మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం**



**కల్వకుర్తి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలో నెలకొల్పిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయుటకు తిమ్మరాశిపల్లి దగ్గర ఉన్న భీమన చెరువును ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. భీమన చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పనులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు మరియు గణపతి మంటప నిర్వాహకులు తమ యొక్క గణపతులను నిమజ్జనం చేయుటకై తిమ్మరాశిపల్లి సమీపంలోని భీమన చెరువులో నిమజ్జనం చేయాలని సూచించారు. మున్సిపాలిటి నుంచి ఏర్పాటు చేసిన భీమన చెరువులో అధికారుల సూచన ప్రకారం సమన్వయం పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహేద్, కమీషనర్ జాకీర్ అహ్మెద్, సీఐ సైదులు, తిమ్మరాశిపల్లి మాజీ సర్పంచ్ సత్యంరెడ్డి, నాయకులు జంగయ్య, పర్వతాలు, తిరుపతయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆసరాపై.. వృద్ధుల ఆవేదన..!

**వీపనగండ్ల,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వృద్ధాప్య, ఒంటరి మహిళ, వికలాంగుల లాంటి ఆసరా పింఛన్లు ఇవ్వడం జరిగిందని అందులో 56 సంవత్సరాలు నిండిన వృద్ధులకు అందని ఆసరా వాటికి పింఛన్లు దాదాపు ఒక వీపనగండ్ల మండలంలో మూడు వందల మందికి పైగా పించన్లు రాలేదని మేము వాటికి అర్హులం కామ అని వృద్ధులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం విదించిన గడువు వరకు 21 వేల అప్లికేషన్లు ఆన్‌లైన్ లో అప్లై చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అందులో 6వేల మందికి పైగా 56సంవత్సరాల వయసు దాటినటువంటి వారికి రాలేదని జిల్లా అధికారులకు అందిన దరఖాస్తుల ప్రకారం తెలిపారు. ఇందులో 6వేల మందికి పైగా ఆన్‌లైన్ లో ఫిల్టర్ చేసినట్లు అధికారులు తెలిపారు. వయస్సు ఉన్న వారికి వదిలిపెట్టి వయస్సు లేని వారికి కూడా వచ్చినట్లు లిస్టులో తెలిపారు. దీన్ని గమనిస్తే వీపనగండ్ల మండలంలో దాదాపు 300 మందికి పైగా బొల్లారం 40, తూముకుంట 50, వీపనగండ్ల 50, గోపల్‌దిన్నె 20, గోవర్ధనగిరి 40 మందికి పైగా రాలేదని వృద్ధులు వాపోతున్నారు. ప్రతి గ్రామంలో అధికారులు వెళ్లి పరిశీలిస్తే ఈ డేటా బయటకి వస్తుందని వృద్ధులు అంటున్నారు. ప్రభుత్వానికి, ఆన్‌లైన్ కు మేము ఏమి పాపం చేశాం?అని ధనికులుగా ఉనన వారికి, వయస్సు లేని వారికి కూడా ఆసరా పింఛన్ మంజూరు కావడం జరిగిందని మాకు వయస్సు ఉండి కూడా పిచన్లు రావడం రాలేదని వృద్ధులు గడ్డమీది బుచ్చన్న, తెలుగు బక్కన్న, తెలుగు బోయ వెంకటయ్య, చిన్నయ్య, గొల్ల లింగయ్య, గొల్ల ధర్మయ్య వాపోయారు. అయితే ప్రభుత్వం చెప్పిన నిబంధనల ప్రకారంగా ఆన్‌లైన్ లో ఓటర్‌ఐడీ, ఆధార్ కార్డు ఐడీ తో పాటు ఫోన్ నెంబర్ లింక్ కలిపి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని



పనగండ్ల ఎంపీడీఓ కార్యాలయం

మాకు మాత్రం రాకుండా మాకన్నా చిన్న వయస్సు వాళ్లకు ఆసరా పెన్షన్లు వస్తున్నాయని వృద్ధులు అంటున్నారు. ఈవిషయాలను గతంలో గ్రామ సభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అధికారులు మాత్రం వాటిని పరిష్కరించకపోగా ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ రావడం జరిగిందని మాకు ఎలాంటి సంబందం లేదని తప్పించుకుంటున్నారు. అర్హులైన వృద్ధులకు పింఛన్ రాని వారికి మరోసారి తూదీ ప్రకటించి దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.



**మేము ఏం పాపం చేశాం..?**

గొల్ల లింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వానికి మేము ఏం పాపం చేశామని మాకు వయస్సు ఉన్న వృద్ధాప్య పెన్షన్ రాలేదు దాదాపు 60 సంవత్సరాలకు పైగా ఉన్నాయని వృద్ధాప్య పెన్షన్ రాని గొల్ల లింగయ్య తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా కన్నా చిన్న వయస్సు ఉన్న వారికి పిన్షన్ రావడం జరిగింది ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న వయస్సు ప్రకారంగా అపి చెప్తున్నారు ఇది అధికారుల తప్పుగా మేము అనుకుంటున్నామని ఆయన అన్నారు.

**నాకు వచ్చిన పెన్షన్ బందు చేశారు..**



ఇటీవల వచ్చిన వికలాంగుల పించను తమకు రాకపోగా గతంలో నాకు వచ్చే పెన్షన్ కూడా రాలేదని అది అధికారులు బందు చేశారని గొల్ల ధర్మయ్య అనే వికలాంగుడు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు తండ్రి తల్లి ఎవరూ లేరని తాను ఒంటరిగా ఉంటానని తనకు మాటలు రావని తను ఒక గొల్ల సంఘం రూపంలో బతుకున్నాను నాకు ప్రభుత్వం పించను వికలాంగుడి గా మంజూరు చేయాలని ఆయన కోరారు.

**అర్హులైన వృద్ధులకు ఆసరా పెన్షన్లు ఇవ్వాలి..**



అర్హులైన వృద్ధులకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ఆసరా పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని వాటిలో అర్హులైన వృద్ధులకు, వయస్సు ఉన్న వారికి రాలేదని మళ్లీ ప్రభుత్వం సర్వే నిర్వహించి వారికి త్వరితగతిన ఇప్పుడు మంజూరు చేసిన లిస్టు ప్రకారంగానే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా వినాయకుని నిమజ్జనం..

**శ్రీరంగాపురం,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** వినాయక చవితి సందర్భంగా ఐదు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్దలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి వినాయక నిమజ్జన మహోత్సవం భక్తులు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నిమజ్జన వేడుకల్లో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు, యువతలో ఉత్సాహం ఎంతలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విశ్వ వ్యాప్తంగా ఉండే ఉత్సవాలన్నీ ఒక ఎత్తు అయితే..గణేష్ నిమజ్జోత్సవం మాత్రం మరో ఎత్తు అని చెప్పవచ్చు. 5 రోజులుగా పూజలందుకున్న వినాయకులను అందంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో ఉంచి భక్తి గేయాలను ఆలపిస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జన మహోత్సవ కార్యక్రమంలో మేళతాళాలతో బాజాబజంత్రీలతో యువత కేరింతలతో నిమజ్జన మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా వినాయక ప్రతిమలకు పూజలు నిర్వహించారు. ఆ తరువాత విఘ్నాలు తొలగించే వినాయకుడి ప్రసాదం అంటే భక్తులందరికి పరమపవిత్రం..ఆ లడ్డు తింటే విఘ్నేశ్వరుడి కరుణ కటాక్షాలు లభిస్తాయని నమ్మకం అందుకే గణనాథుడి ప్రసాదం కోసం భక్తులు ఎదురుచూస్తారు. ఎంత ధరైనా వెచ్చిస్తారు..నువ్వా నేనా అన్నట్లు పోటాపోటీగా లడ్డు వేలంలో పాల్గొని మండలంలోని పలువురు గణనాథుడి లడ్డు వేలం దక్కించుకున్నారు. అనంతరం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన విగ్రహాలను సమీపంలో ఉన్న నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేయడానికి యువత డాన్సులతో జై గణేష్ మహారాజ్ కి జై, జైజై గణపతి, గణపతి బప్పా మోరియా..అంటూ నినాదాలు చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. యువతీ యువకుల నృత్యాలతో ఊరేగింపు ఉత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన గణనాథుడి నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రీరంగాపురం మండల ఎస్ఐ కేటి మల్లేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

# రెండు ఇండ్లలో చోరీ...

**-8తులాల బంగారం, రూ.15వేల నగదు అపహరణ -సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ, క్లూస్ టీం**

**కల్వకుర్తి, సెప్టెంబర్ 04, ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ బ్రిలియంట్ స్కూల్ సమీపంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో శనివారం అర్ధరాత్రి దొంగలు చోరికి పాల్పడ్డారు. 8తులాల బంగారం, 15వేల నగదు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. బాధితుల కథనం మేరకు... రాజవర్ధన్‌రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా సుభాష్‌నగర్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గణపతి పూజలో భాగంగా మేడిపూర్ గ్రామానికి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి వెళ్లారు.ఇంటికి తాళం వేసి ఉన్న విషయాన్ని పసిగట్టిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 8తులాల బంగారం, 15వేల నగదునుతో పాటు ప్రక్కనున్న గెల్వయ్య ఇంట్లో కూడా దొంగలు దొంగతనానికి పాల్పడగా అక్కడ ఏమి లేకపోవడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ద్వారా సమాచారం అందుకున్న కల్వకుర్తి ఎస్ఐ రమేష్‌యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.



బీరువాను ధ్వంసం చేసి దొంగలు

**ఆధారాలు సేకరించిన క్లూస్ టీం సిబ్బంది**

కల్వకుర్తి సుభాష్‌నగర్ బ్రిలియంట్ స్కూల్ సమీపంలోని దొంగలు పడిన రెండు ఇండ్లలో క్లూస్‌టీం సిబ్బంది, పలు ఆధారాలను సేకరించారు. ఫింగర్ ప్రింట్స్‌తో పాటు పలు నమూనాలను సేకరించారు. ఈ తనిఖీలలో కల్వకుర్తి ఎస్ఐతో పాటు పలువురు క్లూస్ టీం సిబ్బంది పాల్గొన్నారు. నైపుణ్యం కలిగిన దొంగల పని అయి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



మైసమ్మ అమ్మవారి గణేష్ మండపం వద్ద మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, టీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, టీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయకుల వద్ద మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బృంగి ఆనంద్‌కుమార్, సీఐ సైదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు గణనాథుడిని పూజించాలని, ఈ యేడాది పాడి పంటలతో రైతులు సుఖ సంతోషాలతో మెలుగాలని వేడుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీనగర్, మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనంతరం ఆయా మండప నిర్వాహకులు ఎడ్మ సత్యం, ఆనంద్‌కుమార్‌లతో పాటు పలువురిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ బోజిరెడ్డి,సూర్యప్రకాష్‌రావు, బాలునాయక్, నాయకులు గోపిరెడ్డి నర్సింహ్మారెడ్డి, సతీష్,సైదులుగౌడ్, జగదీష్, రుక్కుల్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బండారి శ్రీను,ప్రదీప్, స్వామి తదితరులు ఉన్నారు.

# ఉన్నత చదువులు చదివి పట్టా అందుకున్న తిర్మలాపూర్ సర్పంచ్ మహేశ్వరి మహిపాల్ రెడ్డి కూతురు తనుజా

**- కూతురును అభినందించిన తల్లిదండ్రులు**

**రాజాపూర్,ఆగస్టు,04, ప్రభాతవార్త:** ఉన్నత చదువులు అభ్యసించిన రాజాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్ దాచని మహేశ్వ రి మహిపాల్‌రెడ్డి కూతురు తనూజ ఆదివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన కన్వొకేషన్ కార్యక్రమంలో పట్టా అందుకున్నారు. పట్టా పొందిన కూతురిని ఆశీర్వదించిన తల్లిదండ్రులు తనూజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తనూజ తండ్రి మహిపాల్‌రెడ్డి వార్తతో మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని షామీర్‌పేట్‌లో గల బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నోలజి అండ్ సైన్స్ (బిట్స్ పిలాని) కళాశా లలో బీటెక్ అభ్యసించిన తనూజ చదువుల్లో మంచి ఉత్తీర్ణత సాధించినందుకు పట్టాను అందుకుందని తెలిపారు. చదువుల్లో రాణించ డంతో పాటు ప్రస్తుతం బెంగుళూరులోని బ్లూమ్‌బిట్స్ అనే సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. బిట్స్ పిలాని కళాశాలలో విద్యన భ్యసించడంతో అక్కడే ఉద్యోగం సాధించినందుకు కళాశాలయాజమాన్యానికి మహిపాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన్నట్లు తెలిపారు.



పట్టా పొందిన కూతురు తనూజతో తల్లిదండ్రులు మహేశ్వరి మహిపాల్‌రెడ్డి




పట్టా అందుకుంటున్న దాచని తనూజ

## సీపీఐ మహాసభలకు తరలిన నాయకులు..



**పాన్‌గల్,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతేపల్లి తదితర గ్రామాల సీపీఐ కార్యకర్తలు శనివారం సమీపంలోని శంషాబాద్‌లో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ శ్రీరామచంద్రుడు ల ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు.ఈ సందర్భంగా కళావతమ్మ మాట్లాడుతూ మహాసభలలో పార్టీ బలోపేతం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానంపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. మహాసభలకు తరలివెళ్లిన వారిలో మండలంలోని గ్రామాల సీపీఐ నాయకులు ఉన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం..

**పాన్‌గల్,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలలో ఆదివారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులపాటు భక్తిశ్రద్దలతో పూజించి విఘ్నేశ్వరుడిని గ్రామాలలోని చెరువులో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి దగ్గర పూజించిన మహా గణపతికి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా శోభ యాత్ర నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవాల్లో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ శివారులో పోలికి చెరువులో నిర్వాహకులు నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా పాన్‌గల్ ఎస్ఐ నాగన్న ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆర్‌డీఎస్ నిర్వాహకులు థామస్ కు ప్రజాప్రతినిధుల ఘన నివాళి..




**వనపర్తి ప్రతినిధి,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు స్వర్గీయ థామస్ కు ప్రజా ప్రతినిధులు ఘనం గా నివాళి అర్పించారు. వనపర్తిలో సుదీర్ఘ కాలంగా పలు స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన థామస్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడం బాధాకరమని జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం సెయింట్ థామస్ హైస్కూల్‌లో థామస్ సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, చిన్నమ్మ థామస్, లక్ష్మీశంకర్ గౌడ్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు.

## వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తిని పెంపొందిస్తున్నాయి

**- మాజీ ఎంపీపీ నర్సింలు**

**రాజాపూర్, ఆగస్టు, 04 ప్రభాతవార్త:** ప్రతి యేటా నిర్వహించే వినాయక ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయని, మాజీ ఎంపీపీ, రాజాపూర్ మండల రైతుబంధు అధ్యక్షులు అమ్మగల్ల నర్సింలు పేర్కొన్నారు.



ఆదివారం రాజాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో గల నవజ్యోతి యువజన సంఘం వారు ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాల సందర్భంగా అన్నదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు స్వామివారికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన మాజీ ఎంపీపీని నవజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పల్లె ఇస్తారయ్య, అమ్మగల్ల బుగ్గయ్య, పల్లె శేఖర్, పల్లె తిరుపతి, దాసరిగల్ల శేఖర్, పల్లె రాజు, భీమగల్ల నర్సింలు, అమ్మగల్ల హన్మంతు, బి.ఆదిత్య, ఈటె వెంకటేష్, హన్మగల్ల వెంకటేష్, హెచ్.బాల్‌రాజ్, పల్లె శ్రీకాంత్, లవ, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.



## మన్యంకొండలో ఘనంగా స్వామివారి తిరుచ్చిసేవ

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు**

**దేవరకద్ర రూరల్,సెప్టెంబరు 04 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్య క్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు ఈ సేవ నిర్వహించారు. పురోహితుల వేధ మంత్రాలు, భక్తుల హరి నామశ్చరణ, కాగడాల వెలుతురు లో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిధ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



మన్యంకొండలో స్వామి వారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవ పై ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన పూజారులు రాజేశ్, నం~సింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్యంకొండలో స్వామి వారికి హారతి ఇస్తున్న చైర్మెన్ అళహరి

## వెల్టూరును మండల కేంద్రంగా సాధించుకునేదాకా పోరాడుతాం..

**మంత్రి హామీని నిలబెట్టుకోవాలి..**

**జేఏసీ ఆధ్వర్యంలో 7వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు..**

**పెద్దమందడి,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** వెల్టూరు ను మండల కేంద్రంగా సాధించుకునేదాకా ప్రతి ఒక్కరు ఉద్యమానికి అండగా నిలవాలని అచలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెల 29న బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంగా సాధించుకునే విషయంలో పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావాలని పిలుపునివ్వడంతో ఆదివారం అచలపక్ష నాయకులు దీక్ష శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వెల్టూరు గ్రామస్థులకు మంత్రి నిరంజన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఇటీవల దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వారు గుర్తు చేశారు. అన్నీ వసతులు ప్రజలకు అందుబాటులో ఉండే వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అచలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఆర్.శ్రీనివాస్ రెడ్డి(టీడీపీ), ట్రాక్టర్.కృష్ణారెడ్డి, రవి సాగర్, యాదయ్య, తిరుపతయ్య, సతీష్, శివకుమార్, నరేష్, కమ్మరి విజయ్, వడ్డె శేఖర్, సి.రవి, చందు రెడ్డి, శివ, కురువ చందు, చిలకట్‌పల్లి వెంకటేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న అచలపక్ష నాయకులు

## ఇసుక టిప్పరు,రేషన్ బియ్యం పట్టివేత కేసు నమోదు

**బిజినేపల్లి.సెప్టెంబర్04 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందివడ్డేమాన్ గ్రామంలో ఆదివారం ఇసుక టిప్పరు, రేషన్ బియ్యం పట్టు కోని కేసు నమెదు చేసినట్లు ఎసై కృష్ణఓబుల్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం జడ్‌చెర్లకు చెందిన ఓ టిప్పరులో అక్రమ ఇసుక తరలించి సల్కర్‌పేట గ్రామ శివారులో డంపిండ్ చేస్తుండా సమాచారం తెలుసుకున్న ఎసై తన సిబ్బందితో అక్కడకు చేరుకోని టిప్పరును స్వాదినం చేసుకోని పోలిస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మరో సంఘటనలో నందివడ్డేమాన్ గ్రామానికి చెందిన స్వామి ఆనే వ్యక్తి తన స్వంత ఆటోలో 22 క్వింటాల రేషన్ బియ్యం తన పౌల్ట్రీకి తరలిస్తుండగా విషయం తెలుసుకున్న ఎసై అక్కడికి చేరుకోని రేషన్ బియ్యం, ఆటోను స్వాదినం చేసుకోని పోలిస్‌స్టేషన్‌కు తరలించి ఇసుక టిప్పరు, రేషన్‌బియ్యం ఆటోల పై కేసులు నమోదు చేసినట్లు ఎపై కృష్ణఓబుల్‌రెడ్డి తెలిపారు,



పోలీస్‌లు పట్టుకున్న ఇసుక టిప్పరు

## నిమజ్జనానికి తరలిన గణనాథులు..!!

**- బాజాభజంత్రీలు,మంగళవాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు..**

**- అడుగడుగునా భక్తుల నీరాజనాలు..**

**భూత్పూర్,సెప్టెంబర్4, ప్రభాతవార్త :** గడిచిన ఐదు రోజులుగా నిత్యపూజలందుకున్న గణనాథులు ఐదోరోజైన ఆదివారం జలప్రవేశానికి(నిమజ్జనం)తరలివెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే గణనాథుల ఊరేగింపు ఆరంభమైంది. భక్తులు, గణేష్‌మండపాల నిర్వహకులు గణనాథులకు అడుగడుగునా నీరాజనాలర్పించారు. భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాలలో భక్తులు భారీ సంఖ్యలో గణనాథుల ఊరేగింపు నిర్వహించారు. డీజే సౌండ్ బాక్స్‌లతో వీధి, వాడల్లో గణనాథుల కోలాహలం, కోలాటాలు, బతుకమ్మలు, డీజే నృత్యాలతో యువకులు పెద్ద ఎత్తున ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించారు. భూత్పూర్ పట్టణంలోని బీసీ, ఎస్సీ కాలనీలు, శివాలయం, హనుమాన్ దేవాలయం, సంజీవరాయ దేవాలయం, ఠాగూర్ మెమోరియల్ పాఠశాలతో పాటు పట్టణ పరిధిలోని అమిస్తాపూర్ రాజీవ్‌స్వగృహ, లో దాదాపుగా పాతిక వరకు గణేశ విగ్రహాలు ప్రతిష్టించి ఐదు రోజుల పాటు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల వద్ద, పలు ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాలలో గణేష్ విగ్రహాల ప్రతిష్ట జరిగింది.



అమిస్తాపూర్ గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్మన్



గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి భూత్పూర్ పట్టణంలోని ఠాగూర్ మెమెరియల్ స్కూల్ విద్యార్థులు

# అర్హులందరికి ఆసరా పింఛన్లు:ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి

**మదనపురం,సెప్టెంబర్ 04 ప్రభాతవార్త:** అర్హులందరికి ఆసరా పెన్షన్లు అందజేస్తామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మదనపురం మండలం అజ్జకొల్లు గ్రామాలలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు పించన్ల పత్రాలను అందజేసి మాట్లాడారు 57 ఏళ్లు దాటిన వారందరికి కొత్త పెన్షన్లు మంజూరు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని బీజేపీ నాయకులు ప్రజల మధ్య కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ ఓట్లు దండుకునే ప్రయత్నంలో ఉన్నారని ప్రజలు వారి కుట్రలను గమనించాలన్నారు. మోదీ హయాంలో పేదప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పేదప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి అభిమతమని పేదలను ఆదరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్వాడీ కాంపౌండ్‌వాల్ ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అజ్జకొల్లు రైతు వేదిక ప్రారంభానికి మరియు కొత్త ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమనికి వచ్చిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బైక్ ర్యాలీతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మార్గ మధ్యలో వరి నాట్లు కలుపుతీస్తున్న మహిళలు ఎమ్మెల్యే రాకను చూసి రోడ్డు మీదకు వచ్చి ఎమ్మెల్యే ని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం అజ్జకొల్లు గ్రామంలో రైతు వేదికను ప్రారంభించి, సీఎంఆర్ఎస్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతమ్మ వెంకట్ నారాయణ, జడ్పీటీసీ సభ్యులు కృష్ణయ్య యాదవ్, మార్కెట్ చైర్మెన్ శ్రావణ్ రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు హనుమాన్ రావు, రైతుబంధు జిల్లా సభ్యులు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగన్న యాదవ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ అధ్యక్షుడు వడ్డె రాములు, కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, సర్పంచులు రాంనారాయణ, బ్రహ్మమ్మ సత్యం, శివ శంకర్, మండల యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, నాయకులు నాలవర్దన్, కర్ణాకర్ రెడ్డి, రాములు గౌడ్, వివిధ గ్రామాలనాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి



వరి నాట్లు కలుపుతీస్తున్న మహిళను ఎమ్మెల్యే పలకరిస్తున్న దృశ్యం

# యువతకు భరోసా వచ్చింది..!

**-వలస వెళ్లినవాళ్లు వాపస్ వస్తున్నారు-పార్టీలో చేరికల సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కెసిఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలతో తమ జీవితాలు బాగుపడతాయని యువతకు ఒక భరోసా వచి్చందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మార్కెట్ కమిటి ఛైర్మన్ రెహామాన్, 25వ వార్డుకు చెందిన పార్టీ నాయకులు వాజిద్ ఆధ్వర్యంలో ఆటో మెకానిక్, యూనియన్‌కి చెందిన మహ్మద్, సలాంబిన్ మహ్మద్, మహ్మద్ అన్వర్, మహ్మద్ ఖాసిం తదితరులతో పాటు సుమారు 100 మంది టిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో బతుకు దెరువు లేక సుమారు 14 లక్షల మందికిపైగా ముంబాయి, దుబాయ్ వంటి దూర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిస్థితుల్లో పూర్తిగా మార్పు వచ్చిందని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు వంటి పథకాలను ప్రవేశపెట్టి వ్యవసాయం దండగ కాదని పండగని ముఖ్యమంత్రి నిరూపించారని అన్నారు. జిల్లాలో పరిస్థితులు మారిపోయి ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగిపోవడంతో వలసలు వెళ్లిన వారంతా తిరిగి వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. అధికార పార్టీలో చేరిన వారందరికి తాము అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ రెహామాన్, వైస్ ఛైర్మన్ గణేష్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కౌన్సిలర్ రామ్‌లక్ష్మణ్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి..!!

**- భూత్పూర్‌లో ఆసరా పంపిణీలో ఎమ్మెల్యే ఆల..**

**- 300మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ల పత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే..**



భూత్పూర్ కేఎంఆర్ ఫంక్షన్‌హాల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల



ఆసరా పెన్షన్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్,సెప్టెంబర్4, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాలనలో సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతోందని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌లో నేతృత్వంలో రాష్ట్రం బంగారు తెలంగాణ వైపు అడుగేస్తోందని అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే భూత్పూర్ పట్టణంలోని కేఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఆసరా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని అన్నారు. వ్యవసాయానికి నిరాటంకంగా ఉచిత విద్యుత్తు, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇళ్లులేని నిరుపేదలకు డబుల్‌బెడ్ ఇళ్ల కేటాయింపు వంటి సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలౌతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యసహకార సంఘం పర్సన్ ఇంచార్జీ మనెమోని సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తూరు నారాయణగౌడ్‌తో పాటు నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఫారూఖ్‌హుస్సేన్, వెంకటేష్, ఆజీజ్, జాకీర్, మేకల సత్యనారాయణ, గడ్డం యాదయ్య, గడ్డం రాములు, దళితరత్న బోరింగ్ నర్సింహులు, గడ్డం ప్రేమ్, రాములురాథోడ్, సత్తూరు అశోక్‌గౌడ్, సత్తూరు రాకేష్‌గౌడ్, సత్తూరు సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగిపోయిన గుండెలు.. అమలుకాని జిఓ..

**-అచ్చంపేటలో 42వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె**

**అచ్చంపేట అర్బన్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** అచ్చంపేట మండల విఆర్ఎ జెఎసి చైర్మన్ పరమేశ్వర్ కంటతడి పెట్టారు. అచ్చంపేటలో విఆర్ఎలు చేస్తున్న సమ్మె 42వ రోజుకు చేరింది. గత నెల రోజులుగా విఆర్ఎలు చేస్తున్న నిరవధిక సమ్మెలో ప్రధాన డిమాండ్లయిన పేస్కేల్, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలనే డిమాండ్లతో ఆందోళన చేస్తున్న విఆర్ఎలు దిగులు చెందిన రోజుకు ఇద్దరు చొప్పున పేస్కేల్ వస్తదో రాదోననే మనోవేదన చెంది గుండునొప్పితో మరణిస్తున్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం మొండి వైఖరి వీడి అసెంబ్లీలో ప్రకటించిన విఆర్ఎల పేస్కూల్ జిఓను వెంటనే విడుదల చేయాలన్నారు. చనిపోయిన విఆర్ఎల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని 2 ని.ల. మౌనం పాటించారు. కార్యక్రమంలో అచ్చంపేట మండల విఆర్ఎ జెఎసి, కో చైర్మన్ శోభారాణి, వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సాజిత్, ప్రచార కార్యదర్శి రాంగోపాల్, శాంతయ్య, కోశాధికారి నిరంజన్, సభ్యులు రాములు, చిట్టయ్య, నిరంజన్, తవిటి ఆంజనేయులు, గువ్వ వెంకటేష్, చాంద్‌బి, హనుమంతు, మహేష్, శ్రీను, బుద్దుల ఆంజనేయులు, కవిత, ఉమా, అనిత పాల్గొన్నారు.



మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటిస్తున్న విఆర్ఎలు

**అభిమన్యురెడ్డి కూతురు జన్మదినం సందర్భంగా**

# ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

**రాజాపూర్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** టిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి కూతురు చించోడ్ హన్నికరెడ్డి జన్మదినం సందర్భంగా అభిమన్యు యువసేన ఆధ్వర్యంలో బాదేపల్లి పాత బజార్‌లో గల సత్య్శ్వర ఆశ్రమంలో మానసిక దివ్యాంగులకు ఆదివారం అన్నదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో అభిమన్యు యువసేన మండల అధ్యక్షులు రామకృష్ణగౌడ్, కుత్నేపల్లి సర్పంచ్ సేవ్యానాయక్, రాజాపూర్ ఉపసర్పంచ్ అల్లెశ్రీను, చొక్కంపేట గ్రామ కో ఆప్షన్ అజమొద్దిన్, దొండ్లపల్లి రంజిత్‌గౌడ్, అభిమన్యు యువసేన కోశాధికారి కొర్ర హాథిరామ్, రాఘవపూర్ చిరంజీవి, టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రాచమల్ల యాదగిరి, యూత్ వింగ్ మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్, రాఘవపూర్ జనార్ధన్‌గౌడ్, మంచాల మల్లేష్, ఆవుల మంద యాదయ్య, శశిధర్, దేగవత్ రవిందర్, మంచాల రాజు, వంశీ, సురేష్, మణికంఠ, శంకర్, శ్రీనివాస్, యువసేన నాయకులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

**- 24వ వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి**

**- పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**



**జడ్చర్ల,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రశాంత్‌రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆశీస్సులతో ప్రజల ఆశీర్వాదంతో 24వ వార్డు కౌన్సిలర్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా భాగ్యరేఖ

**ఉప్పునుంతల,సెప్టెంబర్4 ప్రభాతవార్త:** మండలంలోని కంసానపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యా యురాలుగా విధులు నిర్వర్తిస్తున్న భాగ్యరేఖ జిల్లా ఉత్తమ ఉపా ధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ప్రకటించారు. కంసాన్‌పల్లి జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలోని మొత్తం 150 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ యూనిఫార్‌ను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా పేద విద్యార్థులను చేరదిసి విద్యాబుద్దులు నేర్పించడంతో పాటు సామాజిక సేవలు చేసిన ఉపాధ్యాయురాలికి జిల్లా ఉత్తమ ఉపా ద్యాయురాలు అవార్డు రావడం గర్వించదగ్గ విషయమని కంసాన్ పల్లి గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయురాలు మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.



## ఆసరా పెన్షన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జడ్పీ ఛైర్మన్



**మక్తల్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని గడ్డంపల్లి రైతు వేదికలో గడ్డంపల్లి, అనుగొండ, అంకెన్‌పల్లి, దాదన్ పల్లి గ్రామాలకు చెందిన 130 మంది కొత్త ఆసరా పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్‌లను, ఐడి కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలకనుగుణంగా ప్రజల వద్దకే పరిపాలన అనే చందంగా సీఎం ఆదేశాలతో నేడు ఆసరా పెన్షన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రజలందరు సమన్వయంతో ఎలాంటి రాజకీయాలకు పోకుండా అర్హులకు పెన్షన్లు అందేవిధంగా చూడడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. గ్రామంలో తిరుగుతూ పెన్షన్‌దారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ వనజ ఆంజనేయులుగౌడ్, ఎంపిపి వనజమ్మ గోవర్ధన్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, టిఆర్ఎస్ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డికి ఘన నివాళి



**మహబూబ్‌నగర్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ ఎస్. జగదీశ్వర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, డిసిసి అధ్యక్షుడిగా పార్టీ ప్రతిష్ట కోసం పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, నాయకులు అన్వర్‌పాషా, మల్లు నరసింహారెడ్డి, సాయిబాబా, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, సుభాష్‌ఖత్రి, బాలస్వామి, అబుబకర్, సుజాత, సహజ, అబ్దుల్ హక్, ఫయుం, నాగరాజు, అంతయ్య, మల్లేష్, జగదీష్, అలీ పాల్గొన్నారు.